



# మత్తు.. ఈ పరికరంతో చిత్తు

ప్రోరెనెటా పరికరం ఆకృతి

- ప్రవాసాంధ్ర బాలిక అద్భుత ఆవిష్కరణ
- ఆధునిక సాంకేతికతతో రూపకల్పన
- డ్రగ్స్ బారి నుంచి చిన్నారులకు రక్షణ

మాదక ద్రవ్యాల మత్తు యువతను చిత్తు చేస్తోంది. వారి బంగారు భవిష్యత్తును అంధకారం చేస్తోంది. మద్యం తాగితే దానిని వాసన ద్వారా పసిగట్టొచ్చు. కానీ.. ఎల్ఎస్‌డీ, కొకైన్ లాంటి మత్తు పదార్థాలను పీల్చడం, ఇంజక్షన్ల ద్వారా శరీరంలోనికి ఎక్కించుకోవడం వల్ల బయటకు ఏ వాసనా రాదు. శరీరం లోపల అవయవాలు మాత్రం ఉత్తేజితమై.. ఓ సరికొత్త అనుభూతికి గురిచేస్తాయి. అందుకే.. మత్తు పదార్థాలకు బానిసలయ్యే వారిని తేలికగా గుర్తించడం కష్టం. దీంతో పాఠశాలల పిల్లలు సైతం మత్తుకు బానిసలుగా మారుతున్నారు. అయినా.. తల్లిదండ్రులు గుర్తించడం లేదు. గుర్తించే సమయానికే పరిస్థితి చేయి దాటిపోతోంది. ఈ మత్తు మహమ్మారి నుంచి పిల్లలను రక్షించుకునేందుకు.. అధునాతన సాంకేతికత ద్వారా పరిష్కారాన్ని చూపించింది.. విజయవాడకు చెందిన ప్రవాసాంధ్ర బాలిక. చేతి గడియారం తరహాలో ఉండే ఓ పరికరాన్ని తయారుచేసింది. దానిని చేతికి బిగిస్తే చాలు.. శరీరం లోపలికి ఎలాంటి మత్తు వెళ్లినా తెలిసిపోతుంది. ఆ సమాచారాన్ని ఆండ్రాయిడ్ ఫోన్లలో నిక్షిప్తం చేసిన యాప్ ద్వారా తల్లిదండ్రులు, శ్రేయాభిలాషులకు తెలిసిపోతుంది. ఈ అధునాతన పరికరానికి అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ గుర్తింపు సైతం లభించింది.

**విజయవాడ సిటీ, న్యూస్‌టుడే**

విజయవాడ మొగల్రాజపురంలో నివసిస్తున్న విశ్రాంత ఉద్యోగి మహ్మద్ అన్వర్ కుమారుడు ఆసిఫ్ అమెరికాలోని డల్లాస్‌లో నివాసం ఉంటున్నారు. ఆసిఫ్ కుమార్తె ఆలియా డల్లాస్‌లోని సెంట్ ఏనియల్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తి ఉండడంతో.. ప్రస్తుతం ప్రపంచానికి పెనుభూతంలా మారిన మత్తుకు పరిష్కారం కనుగొనాలని పరిశోధనలు ప్రారంభించింది. దీనికోసం తన ముగ్గురు స్నేహితులు సారావర్గీస్, ఆంచల్ రఘువంశీ, దండబోయిన దీపికతో కలిసి బృందంగా ముందుకు సాగింది. వీరంతా ప్రవాసభారతీయ పిల్లలే కావడం గమనార్హం. అనుకున్న దిశగా పరిశోధనలు చేసి.. ఓ చేతిగడియారం మాదిరిగా ఉండే పరికరాన్ని కనిపెట్టారు. దానికి ప్రోరెనెటా అని పేరు పెట్టారు. దీనికి అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా సైతం ఆర్థిక సహకారం అందించింది. వీరు చదివే పాఠశాల అధ్యాపకుడు మీర్జా పైజాన్ ప్రాజెక్టుకు సంధానకర్తగా వ్యవహరించారు. అలియా బృందం కనిపెట్టిన.. ప్రోరెనెటా పరికరానికి నాసా ప్రశంసలు దక్కాయి.



## సమాజానికి ఉపయోగపడేలా వినియోగం.. : అలియా మహ్మద్

విజయవాడలోని తాతగారి ఇంటికి సెలవుల సందర్భంగా ప్రస్తుతం వచ్చి ఉన్న అలియా తన పరికరం గురించి వివరించింది. ఈ ప్రాజెక్టును సేవాభావంతో తయారు చేశానని వెల్లడించింది. ప్రాజెక్టును పూర్తిచేసే క్రమంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నామన్నారు. అమెరికాలోని చాలా సాంకేతిక వ్యాపార సంస్థలు ముందుకొచ్చి తమ ప్రోరెనెటా పరికరాన్ని మార్కెటింగ్ చేస్తామన్నాయని, అయితే.. దీనిని వ్యాపార ధోరణితో కాకుండా సమాజం కోసం వినియోగించాలని నిర్ణయించామని అలియా తండ్రి ఆసిఫ్ వెల్లడించారు. పేటెంట్ వచ్చిన తర్వాత అమెరికా ప్రభుత్వ సహకారంతో అందరికీ అందుబాటులో తీసుకురానున్నామని పేర్కొన్నారు.

## పిల్లాడిని కంటికి రెప్పలా కాపాడుతుంది..

ప్రోరెనెటాను పిల్లల చేతికి గడియారం మాదిరిగా పెడితే చాలు. వారు బయటకు ఎక్కడికి వెళ్లినా.. అక్కడి పరిసరాల్లో ఉండే రసాయన వాయువులు, ప్రమాదకర పదార్థాల వాసనను పసిగట్టి.. తల్లిదండ్రులకు చేరవేస్తుంది. ప్రోరెనెటాను అనుసంధానం చేస్తూ రూపొందించిన అప్లికేషన్‌ను తల్లిదండ్రులు వారి సెల్‌ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకుంటే చాలు. క్షణ క్షణం పిల్లల యోగక్షేమాలను వారి మొబైల్ ఫోన్‌కు పంపిస్తుంటుంది. ఏ మాత్రం ప్రమాదకరంగా ఉన్న వాయువులు, పదార్థాల దగ్గరికి పిల్లలు వెళ్లినా ప్రోరెనెటాలోని సెన్సార్లు వాసన పసిగట్టి తల్లిదండ్రులకు చేరుస్తాయి. పిల్లలు ఎలాంటి రసాయనాల మధ్య ఉన్నారు. అవి ఎంత తీవ్రమైనవో తెలియజేస్తుంది. దీనిని ధరించిన వారి చెమట వాసనను బట్టి, విడుదలయ్యే రసాయనాలు, దుష్ఫలితాలను అవతలి వారికి పంపిస్తుంది. ఒకవేళ పిల్లలు డ్రగ్స్‌ను వినియోగిస్తున్న వారి పక్కనుంచి వెళ్తున్నా.. ప్రోరెనెటా వాసన పసిగట్టి తల్లిదండ్రులకు చేరవేస్తుంది.



తండ్రి ఆసిఫ్‌తో అలియా

## పదో తరగతిలోనే అద్భుతం...

అలియా బృందం తయారుచేసిన ఈ అత్యద్భుత ప్రాజెక్టుకు నాసా, అమెరికా ప్రభుత్వంతో పాటు అంతరిక్ష పరిశోధకుడు చార్లెస్ పేటే క్రోనార్డ్ జ్ఞాపకార్థం ఆయన భార్య నాన్సీ క్రోనార్డ్ నిధులను సమకూర్చారు. అమెరికాలోని 'కెనెడీ అంతరిక్ష కేంద్రం'లో ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన పోటీల్లో 142 ప్రాజెక్టులు ఎంపికవ్వగా.. వాటిలో ప్రోరెనెటా మొదటి స్థానంలో నిలిచింది. అనంతరం అమెరికా సీక్రెట్ ఏజెన్సీ సీఐఏ, లండన్, జర్మనీ దేశాల ఆమోదం లభించింది. పదో తరగతిలోనే ఈ నలుగురు ప్రవాస భారతీయ పిల్లలు అద్భుతాన్ని ఆవిష్కరించారని.. నాసా సహా అనేక దేశాలు మెచ్చుకున్నాయి. ప్రస్తుతం ప్రపంచంలోని అనేక దేశాలతోపాటూ మననూ వెంటాడుతున్న అతి ప్రమాదకర భూతం మత్తుపదార్థాలే. ప్రస్తుతం ఇరు తెలుగు రాష్ట్రాల్లోనూ మత్తు మందుల వినియోగానికి సంబంధించిన వార్తలు కలకలం రేపుతున్నాయి. ఇలాంటి సమయంలో తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. తమ పిల్లలను వీటి బారిన పడకుండా ఎలా కాపాడుకోవాలనే ఆందోళన మొదలైంది. వీరందరికీ.. అలియా బృందం కనిపెట్టిన ప్రోరెనెటా పరికరం సహాయకారిగా నిలవనుంది.